సాక్షి
రంగారెడ్డి

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024



మత్తులో యువత చిత్తు

పట్నం నుంచి డ్రగ్స్ కల్చర్ పల్లెలకూ పాకిం ది. గంజాయి మత్తులో యువత పెడదారి పట్టడం ఆందోళన కలిగిస్తోంది. 8లో



ప్రజాస్వామ్యమే ధ్యేయం

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
సోమవారం	మంగళవారం
సాయంత్రం	ఉదయం
6:36	4:42

న్యూస్‌రీల్

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

కొత్తూరు: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు తనను ఆశీర్వదించి గెలిపించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన నందిగామ, కొత్తూరు మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 14 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించనుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీలతో పాటు ప్రభుత్వం అమలు చేసే పథకాలను వర్తింపచేస్తామన్నారు. ఎన్నికల తర్వాత నిరుద్యోగులకు ఆర్థిక సాయంతో పాటు ఏకకాలంలో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ అందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఉపాధిహామీ తరఫున కూలీలకు రోజుకు రూ.400 కూలీతో పాటు ఎక్కువ రోజులు పని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల తర్వాత అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక తమ ఉనికిని కాపాడుకోవడానికి బీఆర్ఎస్, బీజేపీ లేనిపోని ఆరోపణలు చేస్తున్నట్లు విమర్శించారు. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ఎమ్మెల్యేగా, ఇతర పదవుల్లో ఉండి కూడా ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ప్రస్తుత బీఆర్ఎస్ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి గెలిచిన తర్వాత ప్రజలను మర్చిపోయారన్నారు. అనంతరం చౌదరిగూడతో పాటు కొత్తూరు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు శ్యాం సుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, జంగ నర్సింహ పాల్గొన్నారు.

ఉగాది నుంచి నాటక మహోత్సవాలు

బంజారాహిల్స్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిలింనగర్‌లోని డాక్టర్ డి.రామానాయుడు కళా మండపంలో ఈ నెల 9 నుంచి 13 వరకు రాత్రి 9 గంటల నుంచి పద్య నాటక మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఫిలింనగర్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు ఆది శేషగిరిరావు, సెక్రటరీ కాజా సూర్యనారాయణ, కార్యనిర్వాహకులు పొత్తూరి వెంకట సుబ్బారావు నేతృత్వంలో ఈ నాటక మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలి రోజు రాత్రి 9 గంటలకు నాగోల్ శ్రీసీఎస్ఆర్ కళామందిరం వారిచే గుణనిధి, 10న బాపట్ల చెరుకుపల్లి ఉషోదయ నాట్య కళామండలి వారిచే మోహిని భస్మాసుర (పౌరాణిక పద్య నాటకం), 11న హైదరాబాద్ నవక్రాంతి కల్చరల్ అసోసియేషన్‌చే బాలనాగమ్మ పద్యనాటకం, 12న గుంటూరు శ్రీనివాస చైతన్య కళా నాట్య మండలిచే సత్యహరిశ్చంద్ర (వారణాసి, కాటి సీన్లు), 13న రాత్రి 9 గంటలకు ఖమ్మం మధిర సుమిత్ర యూత్ అసోసియేషన్‌చే యయాతి పద్యనాటకం ప్రదర్శించనున్నారు.

జలమండలి చలివేంద్రాలు

పాదచారుల దాహార్తి తీర్చేందుకు చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: ఉష్ణతాపం పెరుగుతున్న నేపథ్యంలో అత్యవసర పనుల నిమిత్తం బయటకి వచ్చే వాహనదారులు, పాదచారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు జలమండలి చర్యలు చేపట్టింది. నగరంలో జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలతో పాటు ఆస్పత్రులు, బస్టాండ్‌ల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఆదివారం బసవతారకం, మెహిదీపట్నం రైతు బజార్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రోజురోజుకీ ఎండలు పెరుగుతుండటంతో జన సంచారం ఎక్కువగా ఉండే ఇతర ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు కేంద్రాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మిగతా ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విడతల వారీగా మిగతా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే కాలంలో జలమండలి ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు మంచి ఆదరణ వస్తే.. వాటిని ఏడాది పొడుగునా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఏవైనా స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు వస్తే.. వారికి ట్యాంకర్ ద్వారా ఉచితంగా నీరు సరఫరా చేస్తామని చెప్పారు. దీని కోసం ఆయా డివిజన్ల అధికారుల్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్–1 అజ్మీరా కృష్ణ, సీజీఎం వినోద్ భార్గవ పాల్గొన్నారు.

రండి.. చేరండి



అప్పుడే మొదలైన 'ప్రైవేటు' ప్రచారం

- జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకు ఆహ్వానం
- సీట్లు భర్తీ చేసుకోవడమే లక్ష్యం
- ఆకట్టుకునేలా కరపత్రాల ముద్రణ
- అధ్యాపకులపై యాజమాన్యాల భారం
- విద్యార్థులను చేర్పించాలని నిబంధన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'సార్, ఇంట్లో ఎవరు..? పదో తరగతి పరీక్ష రాసిన వాళ్లు ఎవరైనా ఉన్నారా..? వారిని మా కళాశాలలో చేర్పించండి' అంటూ అధ్యాపకులు ఇంటింటికీ తిరుగుతున్నారు. జిల్లాలోని పలు జూనియర్ కళాశాలల్లో పనిచేసే ఉద్యోగులు, అధ్యాపకులు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. జూనియర్ కళాశాలల్లో సీట్లు భర్తీ చేసుకునేందుకు యాజమాన్యాలు అధ్యాపకులపైనే భారం వేస్తున్నాయి. విద్యార్థులకు పాఠాలు బోధించడమే కాదు.. ఇంటింటికీ వెళ్లి పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులను గుర్తించి వారిని కళాశాలల్లో చేర్పించే పని మీదేనని జిల్లా పరిధిలోని పలు జూనియర్ కళాశాలలు.. వాటిల్లో పనిచేసే అధ్యాపకులకు స్పష్టం చేశాయి. ఒక్కో అధ్యాపకుడు ఐదు నుంచి పది మంది విద్యార్థులను చేర్పించాలనే నిబంధన పెట్టాయి. అప్పుడే వేతన పెంపు, కొలువు పదిలంగా ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి. ఇంటర్ పరీక్షలు పూర్తయినా అధ్యాపకులకు ఆయా కళాశాలలు సెలవులు ఇవ్వలేదు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు ముగిశాయి. అధ్యాపకులు వారి ఇళ్లకు చేరుకుని కాలేజీ కరపత్రాలు చూపించి విద్యార్థులను ఆకర్షించే పనిలో నిమగ్నమయ్యారు. సాయంత్రం, ఉదయం సమయాల్లో కళాశాల సమీప ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేస్తున్నారు. గురుకుల జూనియర్ కళాశాలలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ప్రైవేటు కళాశాలల్లో చాలా సీట్లు మిగిలిపోయే పరిస్థితి ఉండడంతో యాజమాన్యాలు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.

భవనాలకు మెరుగులు..

సమీప ప్రాంతాల్లోని విద్యార్థులను ఆకర్షించేందుకు పలు ప్రైవేటు కళాశాలలు భవనాలకు మెరుగులు దిద్దుతున్నాయి. అందమైన చిత్రాలను తీయించి కరపత్రాలను తయారు చేస్తున్నాయి. కోహెడ, బొంగ్లూరు జంక్షన్, రావిర్యాల, కొంగరకలాన్, మాదాపూర్, శేరిలింగంపల్లి, కొత్తపేట్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో మైదానాలున్నాయని అందులో పేర్కొంటున్నాయి. పదో తరగతి చదివే పిల్లల జాబితా, ఫోన్ నంబర్లు సేకరించి వారి ఇళ్లకు మధ్య వర్తులను, దళారులను పంపుతున్నాయి. కొందరైతే నేరుగా ఫోన్లు చేసి మాట్లాడుతూ ఆకర్షిస్తున్నారు. కళాశాలకు సంబంధించి ఆకర్షణీయంగా తయారు చేసిన కరపత్రాలను చూపిస్తున్నారు. ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, నిపుణులైన అధ్యాపకులు ఉన్నారంటూ వివరిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన వసతులు అన్నీ ఉన్నాయని వెల్లడిస్తున్నారు.

ప్రవేశాల కోసం రాయితీ ఎర..

జిల్లాలో 17 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా, వందకుపైగా ప్రైవేటు రెసిడెన్షియల్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో కొన్ని ఫీజుల మోత మోగిస్తున్నాయి. ఇంటర్‌లో చేరేటప్పుడు ఫీజులో 20 నుంచి 30 శాతం రాయితీ ఇస్తున్నాయి. పదిలో మార్కుల ఆధారంగా రాయితీ మరింత పెరగొచ్చని వివరిస్తున్నాయి. తర్వాత ఏడాది మాత్రం పూర్తి ఫీజు రాబడుతున్నాయి. ఎంసెట్, నీట్ వంటి ప్రవేశ పరీక్షలకు నిపుణులతో ప్రత్యేకంగా తర్ఫీదు ఇప్పిస్తామంటూ అదనపు ఫీజు వసూలు చేస్తున్నాయి. ఒక్కసారి విద్యార్థులు ఆయా కళాశాలల్లో చేరిన తర్వాత ఏదో ఒక రూపంలో ఫీజులను వసూలు చేస్తున్నారని కొన్నేళ్ల నుంచి అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. కొన్ని కళాశాలలైతే విద్యార్థులకు గాలం వేయడం కోసం రూ.లక్షలు వెచ్చించి మధ్యవర్తులను నియమించుకొంటున్నాయి. వీరి మాటల్లో పడి చాలామంది తల్లిదండ్రులు విద్యార్థులను ఆయా కళాశాలల్లో చేర్పించేస్తున్నారు. ఆ మాటలు నమ్మి ఆయా కళాశాలలను ఎంపిక చేసుకొంటే తర్వాత పశ్చాత్తాపం తప్ప చేయడానికి ఏమీ మిగలదని విద్యారంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అప్పుడే ప్రవేశాలు వద్దు

జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం దళారులు, వాటిల్లో పనిచేసే ఉద్యోగులకు ముందస్తుగా డబ్బులు కట్టి మోసపోవద్దు. ప్రవేశాలకు ఇంకా చాలా సమయం ఉంది. ఇంటర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తేనుంది. కళాశాలల్లో సౌకర్యాలను గుర్తించి అన్నీ సక్రమంగా ఉన్నవాటికే గుర్తింపు ఇవ్వనున్నారు. ఈ జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరిచే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఏ కళాశాలలో ఎలాంటి వసతులున్నాయి.. అనుమతి తీసుకున్న భవనం.. తరగతి గదులు.. అధ్యాపకుల అర్హతలు తదితర సమగ్ర సమాచారాన్ని ఆ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. వీటిని విద్యార్థుల తల్లిదండ్రులు సమగ్రంగా పరిశీలించి ప్రవేశాలు చేసుకుంటే మేలు.

– శ్రీదేవి, డీఐఈఓ, రంగారెడ్డిజిల్లా





ప్రచారానికి సిద్ధం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రచారానికి సన్నద్ధమవుతున్నాయి. ప్రచార రథాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఎన్టీఆర్ స్టేడియంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ప్రచార రథాలు ఇలా కనిపించాయి.



మెట్రో ప్రయాణికులకు షాక్

రాయితీలను ఎత్తేసిన హెచ్ఎంఆర్

సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైల్ షాక్ ఇచ్చింది. కూల్ జర్నీపై ఆంక్షలు విధించింది. పర్యాటకులను, నగరవాసులను విశేషంగా ఆకట్టుకున్న హాలిడే పాస్‌ను ఎత్తేసింది. రూ.59కే లభించే హాలిడే పాస్‌తో ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణం చేసే అవకాశం ఉండేది. రెండో శనివారం, ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉండేది. దీంతో ఆ రోజుల్లో లక్షలాది మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. మార్చి 31 నుంచి హాలిడే పాస్ పథకాన్ని నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రోజువారీ ప్రయాణాలపై లభించే 10 శాతం రాయితీని కూడా నిలిపివేశారు. ఇప్పటి వరకు సుమారు 30 వేల మందికి పైగా విద్యార్థులు వినియోగించుకుంటున్న స్టూడెంట్ పాస్‌ల గడువు కూడా ఈ ఏప్రిల్ నెలాఖరుతో ముగియనుంది. ఈ పాస్‌ను తీసుకున్న విద్యార్థులు తాము ప్రయాణం చేసే మార్గంలో 20 ట్రిప్పులకు చార్జీలు చెల్లించి మరో 10 ట్రిప్పులు ఉచితంగా ప్రయాణం చేయొచ్చు. ప్రస్తుతం ఈ పాస్‌లను వినియోగిస్తున్నవారు ఈ నెలాఖరు వరకు ప్రయాణం చేయొచ్చు. కొత్త ఆర్థిక సంవత్సరం ఆదాయ వ్యయాలను అంచనా వేసేందుకే పథకాలను నిలిపివేసినట్లు సమాచారం.

చీర్‌ఫుల్ బీర్

- గ్రేటర్‌లో పెరిగిన వీటి విక్రయాలు
- రోజుకు 80 వేల కేసులకు పైగా..
- డిమాండ్ మేరకు పెరగని ఉత్పత్తి
- బీర్‌ల తయారీని తగ్గించిన కంపెనీలు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో బీర్‌ల అమ్మకాలు పెరిగాయి. ప్రతీ వేసవిలో సాధారణంగానే బీర్‌లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. మద్యం ప్రియులు లిక్కర్‌కు బదులు చల్లటి బీర్‌ల వైపు మొగ్గు చూపుతారు. వేసవి తాపం నుంచి ఊరట పొందేందుకు వీటిని ఆశ్రయిస్తారు. పెరిగిన బీర్‌ల అమ్మకాల మేరకు ఉత్పత్తి మాత్రం పెరగడం లేదు. ప్రతిరోజూ గ్రేటర్‌లో 60 వేల నుంచి 80 వేల కేస్‌లకు పైగా బీర్‌లు అమ్ముడవుతున్నట్లు అంచనా. మరో 20 వేల కేస్‌లకు డిమాండ్ ఉన్నప్పటికీ కొరత దృష్ట్యా వినియోగదారులకు అందడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వంద కేస్‌ల కోసం ఆర్డర్ చేసే వైన్ షాపులకు 70 కేస్‌ల వరకే లభిస్తున్నట్లు వైన్‌షాపుల నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ నెలలోనే కొరత ఇలా ఉంటే మే నెలంతా బీర్‌ల డిమాండ్‌ను ఎదుర్కోవడం ఎలా అని వ్యాపారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే నెల మరింత డిమాండ్

బీర్ కంపెనీల నుంచి ప్రస్తుతం రోజుకు లక్షన్నర నుంచి 2 లక్షల కేస్‌ల వరకు అందుతున్నాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ లక్షన్నర నుంచి 2 లక్షల కేస్‌లు అమ్ముడవుతున్నట్లు అంచనా. గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే సగానికి ఎక్కువగా బీర్‌ల విక్రయాలు జరుగుతున్నాయి. గతేడాది ఏప్రిల్‌లో గ్రేటర్‌లో సుమారు 12 లక్షల కేస్‌లకుపైగా బీర్‌ల అమ్మకాలు జరిగాయి. ఈసారి 15 లక్షల కేస్‌లకు పైగా డిమాండ్ ఉండే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మే నెలలో ఈ డిమాండ్ మరింత పెరగనుంది. ఈ మేరకు ఉత్పత్తి పెరగడం లేదని అధికారులు చెబుతున్నారు. 'ఇప్పటి వరకు సాధారణ రోజుల్లోలాగే బీర్‌ల ఉత్పత్తి ఉంది. డిమాండ్ మేరకు పెరగలేదు. కానీ.. ఎండలు తీవ్రమయ్యే కొద్దీ ఉత్పత్తి పెంచాల్సి ఉంటుంది. ఈ మేరకు కంపెనీలు బీర్‌లను అందజేస్తాయా? లేదా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది' అని ఒక అధికారి వివరించారు. మరోవైపు బీర్‌ల అమ్మకాలు పెరగడంతో మద్యం విక్రయాలు కొంత మేరకు తగ్గుముఖం పట్టినట్లు వైన్‌షాపుల నిర్వాహకులు తెలిపారు.

బకాయిలు పెండింగ్

వినియోగదారుల డిమాండ్ మేరకు లక్షల కొద్దీ కేస్‌ల బీర్‌లను ఉత్పత్తి చేసే కంపెనీలు కొన్ని రోజులుగా ఉత్పత్తిని తగ్గించాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉండడమే ఇందుకు కారణమని వ్యాపారవర్గాలు తెలిపారు. దాదాపు రూ.4 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. దీంతో 8 కంపెనీలు తమ ఉత్పత్తిని తగ్గించుకున్నాయి. సిబ్బంది సంఖ్యను కూడా తగ్గించారు. ఒకవైపు బీర్‌ల అమ్మకాలు గణనీయంగా పెరుగుతుండగా.. మరోవైపు వీటి తయారీ సంస్థలు ఉత్పత్తులను తగ్గించడం గమనార్హం. వేసవి కారణంగా నీటి ఎద్దడి కూడా బీర్‌ల తయారీకి ఇబ్బందిగా మారిందని పలు కంపెనీల నిర్వాహకులు చెబుతున్నారు. 'రోజుకు లక్షన్నర నుంచి 2 లక్షల కేసుల బీర్‌లను ప్రస్తుతం తయారు చేస్తున్నాం. కానీ ఇదే సమయంలో గతంలో 2 లక్షల కేస్‌లకు పైగా కూడా ఉత్పత్తి జరిగింది. డిమాండ్ మేరకు ఉత్పత్తి పెరగాల్సి ఉండగా, వివిధ కారణాల దృష్ట్యా అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది' అని ఒక కంపెనీ నిర్వాహకుడు విస్మయం వ్యక్తం చేశారు. 40 లక్షల లీటర్‌ల నీళ్లు బీర్‌ల ఉత్పత్తికి అవసరమని, కొద్దిరోజులుగా నీటి లభ్యత తగ్గడంతోనూ బీర్‌ల ఉత్పత్తిపై ప్రభావం పడిందని పేర్కొన్నారు.

కార్పొరేట్ క్వీన్ మిసెస్ ఇండియాగా ప్రీతి అడుసుమిల్లి

మాదాపూర్: ప్రతిష్టాత్మక కార్పొరేట్ క్వీన్ మిసెస్ ఇండియా– 2024, క్లాసిక్ మిసెస్ ఇండియా– 2024 క్రౌన్ విన్నర్‌గా డాక్టర్ ప్రీతి అడుసుమిల్లి నిలిచారు. ఆదివారం మాదాపూర్‌లోని కావూరిహిల్స్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం.. మిసెస్ ఇండియా పేజెంట్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఇటీవల గుర్‌గావ్‌లో జరిగాయి. జాతీయ పోటీలలో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించిన డాక్టర్ ప్రీతి అడుసుమిల్లి గత సెప్టెంబర్‌లో మిసెస్ ఇండియా తెలంగాణ రన్నరప్‌గా నిలిచారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్, డాక్టర్లు పాల్గొన్నారు.



జస్టిస్ రామలింగేశ్వర్‌రావు సేవలు చిరస్మరణీయం

బీసీ హక్కుల పరిరక్షణ సమితి నేతలు



కవాడిగూడ: బీసీ 'ఎ' కులాలలో ఉన్నవారి హక్కుల సాధనకు జస్టిస్ ఎ.రామలింగేశ్వర్‌రావు చేసిన కృషి మరువలేనిదని బీసీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ భాగయ్య, అధ్యక్షుడు నరహరి అన్నారు. హైకోర్టు న్యాయవాదిగా, హైకోర్టు జడ్జిగా జస్టిస్ రామలింగేశ్వర్‌రావు బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆదివారం కవాడిగూడ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని బండమైసమ్మ నగర్‌లో ఉన్న తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జస్టిస్ రామలింగేశ్వర్ రావు హఠాన్మరణం యావత్ బీసీ కులాలకు తీరనిలోటుగా అభివర్ణించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, న్యాయవాది బాలరాజ్, గూడబోయిన శివరత్నం, అంబటి మల్లయ్య, సుధాకర్, కంటె రాంచందర్, సత్యనారాయణ, గడప శంకర్ పాల్గొన్నారు.

అక్రమాలు బయట పడేనా?

- వాహనాల కొనుగోళ్లలో చేతివాటం
- తక్కువ ధరకు లభించే వాటిని ఎక్కువకు కొనుగోలు
- విచారణ నిమిత్తం సీడీఎంఏకు చైర్‌పర్సన్ లేఖ
- తాజాగా ఆర్‌డీఎంఏ రికార్డుల పరిశీలన
- తుర్కయంజాల్ మున్సిపాలిటీలో వ్యవహారం



కొనుగోలు చేసిన వాహనాలు

తుర్కయంజాల్: పురపాలక సంఘంలో వాహనాల కొనుగోళ్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. గత సంవత్సరం జరిగిన వాహనాల కొనుగోళ్లలో అవినీతి, అక్రమాలు బయటకు వచ్చేనా అనే చర్చ స్థానికంగా కొనసాగుతోంది. తాజాగా శనివారం ఆర్‌డీఎంఏ శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో వాహనాల కొనుగోలుకు సంబంధించిన రికార్డులను పరిశీలించడం.. విచారణ చేపట్టడంతో ఈ అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. 'పూజలు చేశారు..మూలన చేర్చారు' శీర్షికన 'సాక్షి'లో 2023 ఆగస్టు 10న కథనం ప్రచురించిన విషయం విదితమే. ఆ తరువాత ఇటీవల మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ వాహనాల కొనుగోళ్లపై విచారణ చేపట్టాలని సీడీఎంఏకు లేఖ రాశారు. కౌన్సిల్ ప్రమేయం లేకుండా అధికారులు ఇష్టారీతిన వాహనాలు కొన్నారని ఆమె అందులో పేర్కొన్నట్లు సమాచారం.

ఎక్కువ ధర చెల్లించి..

స్వచ్ఛ సర్వేక్షణ్–2022లో భాగంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో తుర్కయంజాల్‌కు అవార్డు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ. 2 కోట్ల నిధులు కేటాయించింది. ఈ డబ్బుల్లో అధిక శాతం ఎలాగైనా కాజేయాలని అప్పటి కమిషనర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే వాహనాలను ఎక్కువకు కొనుగోలు చేసినట్లు ఎంబీ రికార్డులు చేయించారు. సూపర్ మిషన్ పవర్ టూల్స్ అనే కంపెనీ ద్వారా రూ.22 లక్షలతో కారు, రూ.32 లక్షలతో 2 లోడర్లు, రూ.36 లక్షలతో 3 టాటా ఏస్ వాహనాలు, రూ.42 లక్షలతో ప్రొక్లెయినర్‌ను కొనుగోలు చేశారు.



రోడ్డుపై మొరాయించిన స్వీపింగ్ మిషన్ (ఫైల్)

రూ.70 లక్షలు వెచ్చించినా..

పై వాహనాలతోపాటు సుమారు రూ.70 లక్షల వ్యయంతో స్వీపింగ్ మిషన్‌ను కొనుగోలు చేశారు. ఈ వాహనాన్ని కూడా 2023 జూలై 7న పాలకవర్గం మొత్తం వాహనాలతో కలిసి ప్రారంభించింది. ఒక గంట కూడా పని చేయకుండానే ఇంజన్ నుంచి ఆయిల్ లీక్ అవుతుండటంతో దాన్ని షెడ్‌కు పంపించారు. తిరిగి తెచ్చిన తర్వాత కూడా ఆ వాహనం రోడ్డు ఊడ్చిన దాఖలాలు లేవు. మరోసారి ఈ ఏడాది ఫిబ్రవరి 7న మధ్యాహ్నం బయటకు తీసేందుకు ప్రయత్నించినా అది కేవలం 100 అడుగుల దూరం వచ్చి సాగర్ రహదారిపై మొరాయించింది. దీంతో సదరు వాహనాన్ని సరఫరా చేసిన సూపర్ మిషన్ పవర్ టూల్స్ కంపెనీ సిబ్బందికి సమాచారం అందించారు. వారు దాన్ని రిపేర్ చేయడానికి ప్రయత్నించినా సఫలం కాకపోవడంతో అదే రోజు తీసుకువెళ్లారు. నేటికీ దాని జాడే లేదు.

ప్రజాధనం దుర్వినియోగం

రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్న వాహనాలు నాలుగు కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడకుండా పోతున్నాయి. కమీషన్ల కక్కుర్తి కోసం అంతగా నాణ్యత లేని వాటిని తెచ్చి మున్సిపాలిటీకి అంటగట్టి ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడ్డ అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, డబ్బులు రికవరీ చేయాలని పలువురు కౌన్సిలర్లు, స్థానికులు కోరుతున్నారు. ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించి అక్రమాలను బయటకు తీయాలని డిమాండ్ చేస్తున్నారు.

విచారణ జరుగుతోంది



వాహనాల కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై విచారణ జరుగుతున్న మాట వాస్తవమే. ఇందులో భాగంగా శనివారం ఆర్‌డీఎంఏ మున్సిపల్ కార్యాలయానికి వచ్చి రికార్డులు పరిశీలించారు. దీనిపై కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ దృష్టి సారించారు.

– బి.సత్యనారాయణ రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్

ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

- రేవంత్ పాలన అద్భుతం
- లోకసభ ఎన్నికల్లో విజయం కాంగ్రెస్‌దే
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: దేశంలో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యా నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా కాంగ్రెస్ నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వంద రోజుల్లోనే అనేక అద్భుత విజయాలు సాధించామని, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కాంగ్రెస్ మరింత చేరువయిందని కసిరెడ్డి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పార్టీ రూపొందించిన మేనిఫెస్టోతో దేశ ముఖచిత్రం మారిపోయి, ఆర్థిక అసమానతలు తొలగిపోవడం ఖాయమని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించి, కేంద్రంలో అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తంచేశారు. అనంతరం పాంచ్ న్యాయ్ అమలు చేయడంతో పాటు కుల, ఆర్థిక గణన చేపడుతుందని చెప్పారు.

ఉపాధి వేతనం పెంపు

కేంద్రంలో అధికారం చేపట్టిన అనంతరం దేశ సమగ్రాభివృద్ధికి చారిత్రాత్మక, విప్లవాత్మక నిర్ణయాలను తీసుకునేందుకు పార్టీ కృషి చేస్తుందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఉపాధిహామీ రోజువారి వేతనం రూ.400 పెంచడంతో పాటు, రైతులకు రుణమాఫీ, బీమా సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద పేదింటి ఆడబిడ్డలకు ఏడాదికి రూ.1లక్ష చొప్పున ఆర్థిక సాయం చేయనున్నామని, ఉద్యోగ ఖాళీలను పూరించి, నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపనున్నట్లు స్పష్టం చేశారు. వ్యవసాయక ఉత్పాదకాలపై జీఎస్టీ తొలగింపు, కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దుకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎంపీటీసీ రాములుగౌడ్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, శేఖర్‌గౌడ్, జిల్లా నాయకులు కొండల్‌రెడ్డి, చందోజీ, కృష్ణ,సింగిల్‌విండో డైరెక్టర్లు వెంకటేశ్, డాక్టర్ శ్రీను, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, నరేశ్‌నాయక్, బిక్కునాయక్, ఇమ్రాన్, శ్రీనునాయక్, అశోక్, చెన్నయ్య, శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

వృద్ధురాలి మెడలోంచి మంగళసూత్రం అపహరణ

ఇబ్రహీంపట్నం రూరల్: రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకు వస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి మంగళసూత్రం అపహరించిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లికి చెందిన పన్నాల యశోద (72) సాయంత్రం రేషన్ సరుకులు తీసుకొని ఇంటికి వెళ్తుండగా.. గుర్తు తెలియని ఇద్దరు దుండగులు ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడును లాగారు. ఈ క్రమంలో వృద్ధురాలు కిందపడినా వదలకుండా గొలుసును తెంపుకు వెళ్లారు. నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లారని బాధితురాలు కన్నీటి పర్యంతం అయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితిని ఆరా తీసినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తాళం వేసిన ఇళ్లలో చోరీ



ధ్వంసమైన బీరువాను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

నందిగామ: తాళం వేసిన రెండు ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. నగదుతో పాటు, తులం బంగారం అపహరించారు. ఈ ఘటన నందిగామలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామకు చెందిన లంకాల లక్ష్మారెడ్డి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో హైదరాబాదుకు వెళ్లారు. ఇది గమనించిన దొంగలు రాత్రి వేళలో తాళం పగల గొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా విరగ్గొట్టి రూ.30 వేల నగదు, తులం బంగారం ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న లక్ష్మమ్మ ఇంట్లోకి చొరబడి రూ.5 వేల నగదును అపహరించారు. లంకాల వినితమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

మత్తులో యువత చిత్తు

మాదక ద్రవ్యాల వినియోగంతో యువత పెడదారి పడుతోంది. దురలవాట్లకు చేరువై జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. మత్తులో ఏం చేస్తున్నారో తెలియని దుస్థితికి చేరుకుంటున్నారు. తప్పని వారించిన వారిని.. చంపడానికైనా, లేదా తాను చావడానికైనా వెనకాడటం లేదు. ఇటీవల జిల్లాలో ఇదే జరిగింది. డ్రగ్స్‌కు అలవాటు పడి కన్న తండ్రినే అంతమొందించిన సంఘటన కలకలం రేపింది.

- నగర శివారులో జోరుగా వ్యాపారం
- ఇష్టారాజ్యంగా మాదక ద్రవ్యాల క్రయవిక్రయాలు
- విద్యార్థులు, వలస కూలీలే టార్గెట్
- పార్టీల పేరుతో రిసార్ట్స్, ఫాంహౌసుల్లో వినియోగం
- పెరుగుతున్న క్రిమినల్ దుశ్చర్యలు



ఆదిబట్ల ఠాణా పరిధిలో గంజాయితో పట్టుబడిన నిందితులను చూపుతున్న పోలీసులు (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: పట్టణాల నుంచి డ్రగ్ కల్చర్ పల్లెకు పాకింది. ఒకప్పుడు నగరాలకే పరిమితంగా ఉండేంది. విదేశాల నుంచి లేదంటే ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యేది. పబ్బుల కేంద్రంగా గుట్టుగా వ్యవహారం కొనసాగేది. పోలీసుల సోదాలు విస్తృతం కావడంతో.. డ్రగ్స్ వ్యాపారులు పల్లెలను సురక్షిత ప్రాంతాలుగా ఎంచుకున్నారు. రంగారెడ్డి జిల్లాకు రాజధాని హైదరాబాద్ సమీపాన ఉండటంతో గ్రామీణ ప్రాంతాలకు గంజాయి, కొకెన్, యాష్ అయిల్ తదితర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తూ.. విద్యార్థులను బానిసలుగా మారుస్తున్నారు. ఇబ్రహీంపట్నం డివిజన్, వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ తదితర ప్రాంతాలను కేంద్రాలుగా మార్చుకున్నారు. అక్కడి నుంచి గ్రామీణ ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రాము రూ.100, 200లకే లభ్యం అవుతుండటంతో రెండు పదుల వయసు నిండని వారు సైతం మత్తుకు బానిసవుతున్నారు.

మత్తులో అఘాయిత్యాలు

జిల్లాలోని మొయినాబాద్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్ జిల్లాలో కీసర, ఘట్కేసర్ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కళాశాలలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ విదేశీ విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా.. స్వదేశీ యువత వారిదారిలోనే పయనిస్తోంది. మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. అదే విధంగా బహుళజాతి కంపెనీలు రావడం, ఇటుక బట్టీలు తదితర పరిశ్రమలు కొలువుదీరగా.. వాటిల్లో పని చేసే కార్మికులు ఒడిస్సా, బిహార్, చత్తీస్‌ఘడ్, బెంగాళ్ ప్రాంతాలకు చెందిన వారే అధికంగా ఉండటంతో వీరికి డ్రగ్స్‌ను ఎరవేస్తున్నారు. ఇలా మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దొంగతనాలు, ఆడవారిపై అఘాయిత్యాలు, అకారణంగా గొడవలకు దిగడంతో పాటు హత్యలు చేయడానికి సైతం వెనకాడటం లేదు.

మద్యంతో పాటు గంజాయి

రాజధానికి సమీపాన ఉన్న ఇబ్రహీంపట్నం, శంకర్‌పల్లి, మంచాల, యాచారం, మొయినాబాద్ లాంటి ప్రాంతాల్లో రిసార్టులు, క్లబ్‌లు, ఫాంహౌస్‌లు విపరీతంగా పెరిగిపోయాయి. వీటిల్లో ఇక్కడి యువతతో పాటు, పొరుగ రాష్ట్రాల వారు రకరకాల పార్టీ(దావత్)లు చేసుకుంటున్నారు. విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లుతూ ఎంజాయ్ చేస్తుంటారు. దీంతో క్రమంగా డ్రగ్ కల్చర్ పల్లె ప్రాంతాలకు చేరువయింది. మద్యంతో పాటు గంజాయి, కొకెన్, హుక్కా విచ్చలవిడిగా సేవించడం అలవాటుగా మార్చుకున్నారు.

ఉక్కుపాదం మోపుతున్నాం



డ్రగ్స్ కల్చర్‌పై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, యాచారం ప్రాంతాల్లో పలు రకాల మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాం. చాలా కేసులు నమోదు చేశాం. డ్రగ్స్ క్రయవిక్రయాలు నేరం. కఠిన శిక్షలు ఉంటాయి. పోలీసు వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తోంది. ఇలాంటి కేసుల్లో ఎవరున్నా ఉపేక్షించేది లేదు. యువత వ్యసనాలకు బానిస కావొద్దు. జీవితాలను చీకటి మయం చేసుకోవద్దు. తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేయవద్దు.

– కేపీవీ రాజు, ఇబ్రహీంపట్నం ఏసీపీ

దివ్యాంగుల డిమాండ్లను మేనిఫెస్టోలో చేర్చాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివ్యాంగుల న్యాయమైన డిమాండ్లను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆదివారం గాంధీభవన్‌లో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎన్నికల మేనిఫెస్టో ప్రతినిధి టి.కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దివ్యాంగులకు ప్రతి నెల రూ.6 వేల చొప్పున పింఛన్ ఇవ్వాలని, చట్టసభల్లో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని, చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, దివ్యాంగుల సంక్షేమ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, దివ్యాంగులపై జరుగుతున్న అఘాయిత్యాలపై విచారణకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిఎస్‌డి కోకన్వీనర్లు వి.భారతి, కాటమోని వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆదిబట్ల చైర్మన్



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని తన క్యాంపు కార్యాలయంలో ఆదిబట్ల మున్సిపాలిటీ నూతన చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ కమాండ్ల యాదగిరిలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని చైర్మన్ కోరగా.. ఎమ్మెల్యే స్పందించి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కౌన్సిలర్ హరిదాసుగౌడ్, నాయకులు మర్రి రాంరెడ్డి, కుంట్ల ఉదయ్‌పాల్‌రెడ్డి, నల్లబోలు పాండురంగారెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

నేడు బీజేపీ ప్రజా ఆశీర్వాద యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

చేవెళ్ల: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్ర సోమవారం చేవెళ్ల నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు దేవుని శర్వలింగం, వెంకట్‌రాంరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత నెల 28న ప్రారంభమైన యాత్ర.. శంషాబాద్ నుంచి పరిగి తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల మీదుగా ఇక్కడికి వస్తుందని పేర్కొన్నారు. నవాబుపేట మండలం పూలపల్లిలో ప్రవేశించి నారగూడ, ఎల్లకొండ, మైతాప్‌ఖాన్‌గూడ గ్రామాల మీదుగా ఈ యాత్ర సాగుతుందని చెప్పారు. పార్టీ శ్రేణులు అందరూ పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు నాగరాజుగౌడ్, కృష్ణ, అమరేందర్‌రెడ్డి, హన్మంత్ తదితరులు ఉన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

తల్లీ, బిడ్డ క్షేమం



నవజాత శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

షాద్‌నగర్: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ నిండు గర్భిణిని కాన్పుకోసం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. నందిగామ మండలం చేగూరు గ్రామానికి చెందిన గునగంటి కల్పనను పురుడు కోసం ఆమె కుటుంబ సభ్యులు షాద్‌నగర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. గర్భిణిని పరీక్షించిన వైద్యులు.. ప్రసవం కోసం హైదరాబాద్ పేట్లబుర్జుకు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ఆమెను అంబులెన్స్‌లో నగరానికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బందిలో ఒకరైన అత్యవసర వైద్య నిపుణుడు సత్యనారాయణ, పైలెట్ మహబూబ్ సహాయంతో పురుడు పోశారు. ఆ ఇల్లాలు మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్య సిబ్బంది తెలిపారు.

కష్టపడితే బంగారు భవిష్యత్తు



ఫలితాలను విడుదల చేస్తున్న డాక్టర్ సాత్వికారెడ్డి

మొయినాబాద్‌రూరల్: ఉన్నత విద్యలో కష్టపడి చదివితే మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటారని చైతన్య డీమ్డ్ టూబీ విశ్వవిద్యాలయం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ సాత్వికారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధి హిమాయత్‌నగర్‌లోని చైతన్య యూనివర్సిటీ బీటెక్ తదితర కోర్సుల మొదటి సంవత్సరం ఫలితాలను సాత్వికారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా బీటెక్, బీఫార్మసి, బీఎస్సీ, బ్యాచులర్ ఆఫ్ ఫిజియోథెరపీ, బీఎస్సీ అగ్రికల్చర్ తదితర వాటిల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు. అనంతరం మాట్లాడారు. నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. క్రమశిక్షణ అలవర్చుకుంటే విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించగలుగుతారని విద్యార్థులను ఉద్దేశించి చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య జగదీశ్వర్, అడ్మినిస్ట్రేటివ్ డీన్ రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు పాల్గొన్నారు.

సర్వమతాల సమూహమే కాంగ్రెస్ పార్టీ

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సర్వమతాల సమూహమే కాంగ్రెస్ పార్టీ అని, అన్ని మతాలను గౌరవించే లౌకిక పార్టీ అందరికీ అండగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో ఆదివారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు పార్టీ భువనగిరి పార్లమెంటు అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డిలు హాజరయ్యారు. మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ లౌకిక పార్టీ అని, కులం, మతం పేరుతో రాజకీయాలు చేయబోదన్నారు. భక్తి శ్రద్ధలతో జరుపుకొనే పండగ రంజాన్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ముస్లింలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ స్రవంతి, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, మహమ్మద్ గౌస్, డాక్టర్ సంజీవ్ కుమార్, రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ బర్ల మంగ, ఆకుల నందు, కృష్ణ, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్ పనులు జరిగేనా..?



గుంతల దశలోనే నిలిచిపోయిన మోడల్ మార్కెట్ పనులు

- శంషాబాద్‌లో రూ. 2 కోట్లతో నిర్మాణం
- ఇంకా సెల్లార్ దశలోనే పనులు
- నిధుల విడుదలకు బ్రేక్
- కొన్ని నెలలుగా ముందుకు పడని అడుగు

శంషాబాద్: పట్టణంలోని సింప్లెక్స్ సమీపంలో రూ. 2 కోట్ల నిధులతో చేపట్టిన వెజ్, నాన్‌వెజ్ మోడల్ మార్కెట్ పనులు సందిగ్ధంలో పడ్డాయి. గత సర్కారు ప్రతి పట్టణంలో ఓ మోడల్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. దానిలో భాగంగా పట్టణంలోని సింప్లెక్స్ వద్ద హెచ్‌ఎండీఏకు సంబంధించిన ఎకరం స్థలంలో వెజ్, నాన్ వెజ్ మోడల్ మార్కెట్‌ను నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కాగా ఎనిమిది నెలల కిందటే సెల్లార్ పనులు చేపట్టారు. అయితే సెల్లార్ నిర్మాణంలో నీళ్లు రావడంతో పనులు కొన్ని రోజులు ఆపేశారు..

ఎన్నికల తర్వాత నిధుల మంజూరుకు బ్రేక్

ఎన్నికల అనంతరం టీయూఎఫ్‌ఐడీసీ నిధుల ద్వారా 50 శాతం పనులు పూర్తయిన వాటికి మాత్రమే పురపాలక శాఖ నిధులు విడుదల చేస్తోంది. అయితే ఈ మోడల్ మార్కెట్ పనులు మాత్రం 2 శాతం కూడా కాకపోవడంతో ఈ ప్రాజెక్టును పురపాలక శాఖ ప్రస్తుతానికి పక్కన పెట్టేసి నిధుల విడుదలకు బ్రేక్ వేసింది. దీంతో ప్రభుత్వం మరోసారి నిర్ణయం తీసుకున్న తర్వాత మోడల్ మార్కెట్ పనులు పట్టాలెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మరోవైపు శరవేగంగా మున్సిపల్ కార్యాలయం పనులు

మోడల్ మార్కెట్ పక్కనే హెచ్ఎండీఏ కేటాయించిన స్థలంలో చేపట్టిన మున్సిపల్ కార్యాలయం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ. 5.70 కోట్లతో అన్నిహంగులతో భవనాన్ని నిర్మిస్తున్నారు. ఎన్నికల నాటికే కార్యాలయం పనులు 50 శాతం పూర్తి కావడంతో పురపాలక శాఖ పనులు పూర్తయ్యేందుకు నిధులు విడుదల చేసింది. మరికొద్ది నెలల్లోనే మున్సిపాలిటీ భవనం అందుబాటులోకి రానుంది.

రోడ్డు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి



రోడ్డుపై నిలిచిన వరదను చూపిస్తున్న చిలకమర్రి నర్సింహ

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకుల-ముచ్చింతల్ దారిని పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ముచ్చింతల్ శివారు రోడ్డు మరమ్మతులకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే.. పనులు చేపట్టకుండా తాత్సర్యం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులను ఇందుకు బాధ్యులు చేయాలన్నారు. ఈ రోడ్డు సౌకర్యం లేక ముచ్చింతల్ నుంచి పాల్మాకుల వెళ్లేందుకు స్థానికులు వేరే మార్గాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు పునఃరుద్ధరణతో పాటు మరమ్మతులు చేపట్టాలని కోరారు.